ప్రజాశక్తి
సోమవారం 30 జనవరి 2023
5
విజయనగరం



## ఐఐఎం విద్యార్థులకు కలెక్టర్ సందేశం

ప్రజాశక్తి-విజయనగరం

ఐఐఎంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విశాఖపట్నంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ప్రసంగించారు. మహాత్మాగాంధీ నేషనల్ ఫెలోస్‌నుద్దేశించి, ఆమె స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా సిటిజన్ చార్టర్ అమలుకు సంబంధించిన అంశాలను వివరించారు. ప్రభుత్వ శాఖల పనితీరు, కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారుల పాత్ర, పరిశోధనా విద్యార్థుల పాత్ర, వారు దృష్టి కేంద్రీకరించాల్సిన అంశాలు, వాటి ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఐఐఎం ఎంజిఎన్‌ఎఫ్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ మహ్మద్ షమీమ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో పెరుగుతున్న ఖాతాలు

- తగ్గుతున్న భూకమతాల విస్తీర్ణం
- రికార్డులకే పరిమితమైన ఆక్రమణల గుర్తింపు

**ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సమగ్ర భూ సర్వేతో ఖాతాదారుల సంఖ్య పెరుగుతోంది. ఆ మేరకు భూకమతాల విస్తీర్ణం తగ్గుతోంది. ప్రభుత్వ భూముల ఆక్రమణలు బయట పడుతున్నా ప్రస్తుతానికి అవన్నీ రికార్డుల్లో నమోదుకే పరిమితమౌతున్నాయి. జగనన్న శాశ్వత భూ హక్కు పేరిట జిల్లాలో సుమారు ఏడాది కాలంగా రీసర్వే చేపడుతున్న విషయం విదితమే. తగినంత మంది సిబ్బంది లేకపోవడం, సాంకేతిక సమస్యలు వంటి కారణాలతో రీసర్వే నత్తనడకన సాగుతోంది.**

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లా వ్యాప్తంగా 983 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 807 గ్రామాల్లో 2,796.70 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో డ్రోన్ సర్వే పూర్తయింది. మొదటి దశలో 179 గ్రామాల్లో 84,327 ఎకరాల భూమిలో రీసర్వే పూర్తి చేసినట్టుగా అధికారులు చెబుతున్నారు. ఈ గ్రామాల్లో పూర్వం 50,299 భూమి ఖాతాలు ఉండగా, తాజా సర్వేతో ఈ సంఖ్య 61,751కి పెరిగింది. సబ్‌డివిజన్లు కూడా 92,541 నుంచి 1,94,606కి పెరిగాయి. దీన్ని బట్టి ఆ మేరకు భూ కమతాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టినట్టుగా స్పష్టమౌతోంది. పెరిగిన జనాభా, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల పంపకాలే ఇందుకు కారణమని రెవెన్యూ అధికారులు విశ్లేషిస్తున్నారు.

### పెరిగిన చిన్న కమతాలు

ఖాతాలు, సబ్ డివిజన్ల సంఖ్య పెరగడం వల్ల ఖాతాదారులకు నష్టాలు లేకున్నా, కమతాల విస్తీర్ణం తగ్గుముఖం పట్టడం వల్ల గట్ల రూపంలో కొంత భూమి వృథా కావడం అనివార్యమని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మన జిల్లాలో చిన్న, సన్నకారు రైతులే అధికం. ఎకరా నుంచి మూడెకరాలలోపు ఉన్నవారే ఎక్కువ మంది. అది కూడా నాలుగు దిక్కుల్లో ఉంటున్నాయి. దీనివల్ల చిన్నకమతాలను ఆధునిక యంత్రాలు, పనిముట్లతో వ్యవసాయం చేయలేని పరిస్థితి. ఇటువంటి తరుణంలో కమతాల విస్తీర్ణం మరింత తగ్గినట్టుగా స్పష్టం కావడంతో ఎక్కువ భూమి నాగలి, నక్కులతో సాగుచేయడమే అనుకూలమని, ట్రాక్టర్లు, ఉబాలు, కలుపు మొక్కలు తీసే యంత్రాలను ఉపయోగించడం మనలాంటి జిల్లాల్లో సాధ్యం కాదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

### సిబ్బందిపై పనిభారం

సర్వే పేరిట అధికార యంత్రాంగం హడావుడి చేస్తున్నప్పటికీ, అదనపు సిబ్బంది లేకపోవడం వల్ల ఉన్నవారిపైనే పనిభారం పడుతోంది. చాలాచోట్ల నత్తనడకన సాగుతోంది. సర్వేను వేగవంతం చేయాలంటూ ప్రభుత్వం నుంచి ఒత్తిడి రావడంతో తహశీల్దార్, విఆర్‌ఒ, విఆర్‌ఎ, సర్వేయర్లు ఎలాగోలా పూర్తిచేయాలన్న నిర్ణయానికి వస్తున్నారు. ఇదే పరిస్థితి ఏర్పడితే గతంలో వెబ్‌ల్యాండ్‌లో జరిగిన తప్పిదాలే పునరావృతమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. అప్పట్లో ఒకరి భూమి, మరొకరి పేరున ఆన్‌లైన్ చేయడం వల్ల ఇప్పటికీ రైతులు, భూమి యజమానులు అనేక పాట్లు పడుతున్నారు. అందులోనూ ఇది ఉన్న పరిస్థితిని యథాతథంగా రికార్డు చేసే పనికాదు. రీ సర్వేలో ఎన్ని క్రయవిక్రయాలు జరిగినా ప్రస్తుత యజమాని పేరిట రికార్డు కావాలి. పాస్‌పుస్తకాలు కూడా జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రీసర్వే ఆదరాబాదరాగా చేపడితే భూ యజమానులు నష్టపోయే ప్రమాదం కనిపిస్తోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### కబ్జాలు గుర్తించినా..

రీసర్వేలో ప్రభుత్వ భూములు, చెరువులు, గోర్జులు.. చాలా చోట్ల కబ్జాలకు గురైనట్టు గుర్తించినా, వాటిని రికార్డుల్లో నమోదు చేయడం తప్ప ఆక్రమణలు తొలగించే పని జరగడం లేదు. సర్వే, ఆక్రమణల తొలగింపు ఏకకాలంలో చేపట్టక పోవడం పట్ల అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. చిత్తశుద్ధి ఉంటే ఆక్రమణల వివరాలను కనీసం గ్రామాల్లో ప్రదర్శించాలని పలువురు చెబుతున్నారు. రాజకీయంగా బలమున్నవారు అనుభవిస్తారని, లేదంటే సాగు భూములకు సైతం దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోందని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ధాన్యం కొనుగోలులో

# రైతులకు న్యాయం చేయండి

## జెసికి ఎపి రైతుసంఘం లేఖ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, జామి

ధాన్యం కొనుగోలులో రైతులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆదివారం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌కి లేఖ రాశారు. ఆ లేఖను పత్రికలకు విడుదల చేశారు. ధాన్యం కొనుగోలుకు అనుమతులు తెప్పించిన జెసికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌బికెలో ధాన్యం పరీక్షించి ట్రక్ షీట్ జనరేట్ చేశాకే మిల్లులకు రైతులు తరలిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో మిల్లర్లు కిలోల తరుగు, దిగుబడి రాలేదు, అన్‌లోడ్ ఛార్జి పేరుతో అదనంగా డిమాండు చేస్తూ అన్‌లోడ్ చేయకున్నా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఆర్‌బికెలో ట్రక్‌షీట్ జనరేట్ చేసిన తరువాత మిల్లులకు పంపే బాధ్యత తీసుకోవడం లేదని తెలిపారు. మిల్లు వద్ద కస్టోడియన్ అధికారులు బాధ్యత తీసుకోవడం లేదని, రైతులు గత్యంతరం లేక నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక ఆర్‌బికెల్లో బస్తా 40 కిలోలకు బదులు 42.5 కిలోలకు లెక్క కట్టి ట్రక్ షీట్‌లో నమోదు చేస్తున్నారని వివరించారు. వెంటనే జెసి స్పందించి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**మినీ కాటాలతో చెరకు రైతులను దోపిడీ**

సంకిలిలోని ఇఐడి ప్యారీ చక్కెర పరిశ్రమకు జిల్లా నుంచి తరలిస్తున్న చెరకు పంట విషయంలో మినీ కాటాలు పెట్టి రైతును నిలువు దోపిడీ చేస్తున్నారని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్‌కు లేఖ రాశారు. ఫ్యాక్టరీ యాజమాన్యం అధికారిక కాటాలను మొక్కుబడిగా ఏర్పాటు చేసిందని తెలిపారు. చెరకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లను గంటల తరబడి నిలిపేయడంతో రైతులు విసిగిపోయి, అనివార్యంగా దళారులను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. టన్నుకు 50 కిలోల తరుగు తీసి టన్నుకు రూ.2400 ఇచ్చి రైతులను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చెరకు దళారీ కలెక్షన్ సెంటర్లకు ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు వెంటనే వచ్చి తీసుకెళ్తున్నాయని చెప్పారు. కానీ రైతుల ట్రాక్టర్లను, ఎడ్లబండ్లను గంటల తరబడి వేచి ఉండేలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చక్కెర పరిశ్రమ యాజమాన్యం రైతులకు అన్యాయం చేస్తున్నా సంబంధిత పర్యవేక్షణ అధికారులు పట్టించుకోవడం లేదని లేఖలో వివరించారు. ఇప్పటికైనా జిల్లాలో సంకిలి ఫ్యాక్టరీకి చెరకు తరలింపుపై సమగ్ర విచారణ చేపట్టి, చెరకు రైతులకు జరుగుతున్న దోపిడీపై చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను ఆయన కోరారు.

బాక్సింగ్ పోటీలకు వెళ్తున్న రాష్ట్ర జట్టు క్రీడాకారులు

## బాక్సింగ్ పోటీలకు బయల్దేరిన జట్టు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పది రోజులుగా విజయనగరంలోని రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఉన్న బాక్సింగ్ కోర్టులో జాతీయ పోటీలకు శిక్షణ పొందిన బాక్సింగ్ క్రీడాకారులు ఆదివారం బయలుదేరి వెళ్లారు. భోపాల్‌లో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి ఐదో తేదీ వరకు జరిగే ఖేలో ఇండియా జాతీయ బాక్సింగ్ పోటీలకు రాష్ట్రం తరపున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. 48 కేజీల విభాగంలో జి.అచ్యుతరావు, 51 కేజీల విభాగంలో ఎస్.జ్ఞానేశ్వరరావు, పి.ప్రసాద్, 60 కేజీల విభాగంలో బి.ప్రకాశ్, జి.అంజన్ కుమార్ జాతీయ పోటీలకు వెళ్లారు. వీరికి బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.మన్మధరావు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా జిల్లాకు చెందిన బి.ఈశ్వరరావు వ్యవహరించనున్నారు.

# షోకాజ్ నోటీసు ఇవ్వడం అన్యాయం

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎపిజిఇఎ డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదని ప్రభుత్వం షోకాజ్ నోటీసు ఇవ్వడం సరికాదని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పేర్కొంది. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఆదివారం డ్రైవర్ల సంఘం భవనంలో నిర్వహించిన ఎపిజిఇఎ సమావేశంలో జిల్లా అధ్యక్షులు రామచంద్రరావు మాట్లాడారు. అనేక రూపాల్లో గత రెండేళ్లుగా అధికారులకు, ప్రభుత్వ పెద్దలకు ఉద్యోగుల సమస్యలను, ఆర్థికంగా రావాల్సిన ప్రయోజనాలను ఇవ్వాలని మొరపెట్టుకున్నా స్పందించడం లేదని చెప్పారు. విధిలేని పరిస్థితుల్లో రాష్ట్ర కార్యవర్గ తీర్మానం మేర రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శి జి.ఆస్కారావు గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్‌ను కలవాల్సి వచ్చిందన్నారు. అందుకు సంఘం గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదోనని షోకాజ్ నోటీసు ప్రభుత్వం నుండి రావడం దురదృష్టమని చెప్పారు. కాని ఉపాధ్యాయ, ఉద్యోగుల హక్కుల కోసం, రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం పోరాటంలో వెనుకడుగు వేసే ప్రశ్నే లేదన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి కంది వెంకటరమణ మాట్లాడారు. ఈ సందర్భంగా ఒకటో తేదీనే జీతాలు ఇవ్వాలని, డిఎలు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఫెస్టివల్ అడ్వాన్స్, ఎల్‌టిసిలు పునరుద్ధరించాలని, సిపిఎస్ రద్దు చేయాలని, ఉద్యోగులకు ఫ్రెండ్లీ ప్రభుత్వంగా చెప్పే సర్కారు ఆ దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని, తదితర తీర్మానాలు చేశారు. సమావేశంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

# హైడ్రామా నడుమ పోస్టుమార్టం

## కమిషనర్ హామీ ఆలస్యంతో బంధువుల ఆందోళన

పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న శ్రావణ్ బంధువులు, కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ఈ నెల 28న పట్టణంలో స్టేట్‌బ్యాంకు వద్ద నగర పంచాయతీ వాటర్ ట్యాంకర్ ఢీకొని కొండవీధికి చెందిన శ్రావణ్ మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం పోస్టుమార్టం నిర్వహించడంలో హైడ్రామా కొనసాగింది. తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల మధ్య సాయంత్రం 4.30 గంటలకు పోస్టుమార్టం నిర్వహించారు. ముందుగా ఉదయం శ్రావణ్ భార్య, తల్లి, బంధువులు ఏరియా ఆస్పత్రికి చేరుకుని తమకు న్యాయం చేసే వరకు పోస్టుమార్టం నిర్వహించవద్దని పట్టుబట్టారు. దీంతో ఎస్ఐ శివప్రసాద్ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం నుంచి చర్చలు జరిపారు. విశ్రాంత కమిషనర్ లిల్లీపుష్పనాథం, వార్డు నాయకులు ఆకుల కుమార్, తదితరులతో మాట్లాడారు. శ్రావణ్ మృతితో ఆ కుటుంబం రోడ్డున పడిందని, రెండేళ్ల పాప ఉందని, మృతుడి భార్య ప్రవల్లికకు నగర పంచాయతీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ సర్వేశ్వరరావు అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడారు. నగర పంచాయతీ ట్రాక్టర్ ఢీకొనడంతో బాధ్యత వహించి, మానవీయ కోణంలో ఆలోచించి ఉపాధి కల్పించాలని పట్టుబట్టారు. దీనిపై కమిషనర్ స్పందించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. ఈ విషయంపై లిఖిత పూర్వకంగా తమకు హామీ ఇవ్వాలని, అప్పుడే పోస్టుమార్టం జరుగుతుందని చెప్పారు. దీనికి కమిషనర్ అంగీకరించలేదు. డిఎస్‌పి జి.వి.కృష్ణారావు జోక్యం చేసుకుని మృతుడి బంధువులు, పెద్దలతో మాట్లాడారు. ఆ కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. కమిషనర్‌తో మాట్లాడి ఉద్యోగం ఇప్పిస్తామని లిఖిత పూర్వకంగా అంగీకార పత్రం ఇవ్వాలని సూచించారు. అయితే ఇన్‌ఛార్జి మేనేజర్ నాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ దేవ్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఇక్కడ పరిస్థితిని వివరించారు. సాయంత్రం వరకు కమిషనర్ లిఖితపూర్వకంగా ఇవ్వకపోవడంతో బంధువులు పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమిషనర్, ఎఇపై కేసులు నమోదు చేయాలని పట్టుబట్టారు. దీంతో కమిషనర్ ఇన్‌ఛార్జి మేనేజర్‌కు లిఖితపూర్వకంగా రాసి ఇవ్వాలని ఆదేశించారు. వెంటనే ఆ పత్రాన్ని డిఎస్‌పికి అందజేశారు. శ్రావణ్ కుటుంబ సభ్యులకు డిఎస్‌పి ఆ పత్రం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడొద్దని చెప్పారు.

# కొండడాబాకు పండగొచ్చింది

## యాత్రకు సర్వం సిద్ధం

వ్యాకులమాత పుణ్యక్షేత్ర ముఖద్వారం

ప్రజాశక్తి-కొత్తవలస

కొండడాబా యాత్రకు సర్వం సిద్ధమైంది. పండగకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లన్నీ సిద్ధమయ్యాయి. కొత్తవలస మండల కేంద్రానికి సుమారు ఏడు కిలోమీటర్లు దూరంలో కొండడాబా వద్ద వ్యాకులమాత పుణ్యక్షేత్ర యాత్ర మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. సుమారు 133 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన యాత్రకు ఉత్తరాంధ్రలో విశిష్ట స్థానముంది. ప్రతి ఏటా ఫిబ్రవరి నెల మొదటి ఆదివారం జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ జాతరకు ఉత్తరాంధ్రతోపాటు రాష్ట్ర, దేశ నలుమూలల నుంచి పెద్దఎత్తున యాత్రికులు వస్తుంటారు. రోమన్ కేథలిక్‌లు అమితంగా పూజించే వ్యాకులమాత జాతర అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఫిబ్రవరి 5న యాత్రకు కొండడాబాలు విచారణ కర్త డాక్టర్ గొంగాడ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

**నవదిన పూజలు ప్రారంభం**

ఈ నెల 27న ప్రధానార్చకులు బవిరి సురేష్‌బాబు పతాకావిష్కరణతో జాతర ప్రారంభమైంది. ప్రతి రోజూ సాయంత్రం 4.30 గంటలకు కొండ దిగువన శిలువ చెంత వ్యాకుల మాత జపమాలలు, దివ్యబలిపూజ, నవదిన ప్రార్థనలు నిర్వహిస్తున్నారు.

ఫిబ్రవరి 4న శనివారం విశాఖపట్నంలోని జ్ఞానాపురం నుంచి పాప పశ్చాత్తాప మహా పాదయాత్ర ప్రారంభమవుతుంది. 5న ఉదయం 4 గంటల నుంచి గంట గంటకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు దివ్య మేత్రాసన నూతన గురువులు దివ్య బలిపూజతో యాత్ర ముగుస్తుంది.

**ప్రత్యేక పోలీసు బందోబస్తు**

కొండడాబా వ్యాకులమాత జాతరలో యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 150 మంది పోలీసు సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సిఐ ఎస్.బాల సూర్యారావు తెలిపారు. శని, ఆదివారం రెండు రోజుల పాటు జాతర జరుగుతుందని, యాత్రికులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటించాలని, మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని కోరారు.

# నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

**ఇంటర్‌మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎం.సత్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, నిఘా నీడలోనే పరీక్షలు జరగనున్నాయని వెల్లడించారు. ఈ వారం 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 26 నుంచి నిర్వహిస్తుండటంతో పరీక్షల నిర్వహణకు తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. ఆ వివరాలు..**

– ప్రజాశక్తి, విజయనగరంటౌన్

- అన్ని కేంద్రాల్లోనూ సిసి కెమెరాలు
- 77 కేంద్రాల్లో పరీక్షలు
- 152 కేంద్రాల్లో ప్రాక్టికల్స్
- 'ప్రజాశక్తి'తో ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ ముఖాముఖి




**? పరీక్షలు ఎప్పటినుంచి జరగనున్నాయి?.**

ఇంటర్‌మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు మార్చి 26 నుంచి ఏప్రిల్ నాలుగో తేది వరకు జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 20 నుంచి మార్చి ఏడో తేది వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు రాయాలంటే ముందుగా ఫిబ్రవరి 15, 17న జరిగే మానవతా విలువలు, పర్యావరణ విద్య పరీక్షలు రాయాలి. ఈ రెండు పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు మాత్రమే మెయిన్ పరీక్షలకు అర్హత సాధిస్తారు. ప్రతి విద్యార్థి ఈ రెండు పరీక్షలు తప్పనిసరిగా రాయాల్సి ఉంది.

**? ఇంటర్ పరీక్షలు ఎన్ని కేంద్రాల్లో జరగనున్నాయి? వాటిలో సమస్యాత్మక కేంద్రాలను ఎన్నింటిని గుర్తించారు?.**

జిల్లాలో ఇంటర్‌మీడియట్ థియరీ పరీక్షలు 77 కేంద్రాల్లో జరగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు 152 కేంద్రాల్లో నిర్వహిస్తున్నాం. ప్రాక్టికల్ పరీక్షలు సెల్ఫ్ కేంద్రాల్లో ఏర్పాటు చేశాం. థియరీ పరీక్షలు 77 కేంద్రాలకు గాను 41 ప్రయివేటు, 36 ప్రభుత్వ యాజమాన్యాల్లో ఉన్న కళాశాలల్లో జరగనున్నాయి. ఎటువంటి సమస్యాత్మక కేంద్రాలూ లేవు.

**? ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు?.**

ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 18,742 మంది, ఒకేషనల్ విద్యార్థులు 5,726 మంది హాజరుకానున్నారు. ద్వితీయ ఇంటర్‌లో జనరల్ విద్యార్థులు 18,719 మంది, ఒకేషనల్ విద్యార్థులు 4289 మంది పరీక్షలు రాయనున్నారు. జిల్లాలో 106 ప్రయివేటు కళాశాలలు, 35 ఒకేషనల్ కళాశాలలతోపాటు 96 ప్రభుత్వ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు.

**? విద్యార్థులను ఏవిధంగా సన్నద్ధం చేస్తున్నారు?.**

సంక్రాంతి పండగ నాటికే ఇంటర్‌మీడియట్ సిలబస్ పూర్తి చేశారు. విద్యార్థులను పరీక్షలకు ఇప్పటికే సన్నద్ధం చేసే ప్రక్రియ ప్రారంభించారు. పాఠ్యాంశాలు పూర్తయిన వెంటనే పరీక్ష నిర్వహించారు. వీటితోపాటు అదనపు తరగతులు, స్టడీఅవర్లు నిర్వహించి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే స్టడీ మెటీరియల్‌ను అందించాం. విద్యార్థులకు అన్ని రకాలుగా పరీక్షలపై ఉండే భయం పోగొట్టేందుకు చర్యలు తీసుకున్నాం. ఈ నెలాఖరున ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు.

**? ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు తీసుకున్న చర్యలేమిటి?.**

గతేడాది కేవలం 36 శాతం మాత్రమే ఫలితాలు వచ్చాయి. దాన్ని అధిగమించేందుకు ఈ ఏడాది 45 నుంచి 50 శాతం ఫలితాలు వచ్చే విధంగా అధ్యాపకులను సిద్ధం చేసి పాఠ్యాంశ బోధన చేయించాం. ప్రతీ విద్యార్థిపై అధ్యాపకుడు దృష్టి ఉండేలా ఈఏడాది చర్యలు తీసుకున్నాం. గతేడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావంతో ఉన్నాం.

**? పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలేమిటి?.**

ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని రకాల జాగ్రత్తలు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకున్నాం. పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, మరుగుదొడ్లు, లైటింగ్, తాగునీరు వంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు చేపట్టాం. ఇప్పటికే అన్ని పరీక్షా కేంద్రాలను సందర్శించాం. పరీక్షకు వచ్చే విద్యార్థి సకాలంలో చేరుకునేలా రవాణా సౌకర్యం కల్పిస్తాం. ఆర్‌టిసి, పోలీసు, రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖల సహకారం తీసుకున్నాం. వారితో ఇప్పటికే సమావేశమయ్యాం.

**? చూసి రాతలు అరికట్టేందుకు తీసుకున్న జాగ్రత్తలు ఏమిటి?**

ఈఏడాది మాల్ ప్రాక్టీసుకు అవకాశం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నాం. తనిఖీ బృందాలు ఉన్నప్పటికీ పరీక్షా కేంద్రాల వద్ద సిసి కెమెరాలను కూడా ఏర్పాటు చేశాం. చూసి రాతలకు అవకాశం లేదు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయడంతోపాటు 144 సెక్షన్ అమల్లో ఉంటుంది.

# నేడు 'చేదోడు' సాయం విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్రంలోని చేతివృత్తుల వారికి ఆర్థికంగా అండగా నిలిచే లక్ష్యంతో జగనన్న చేదోడు పథకం కింద మూడో విడత ఆర్థిక సహాయం పంపిణీని సోమవారం ప్రారంభిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పల్నాడు జిల్లా వినుకొండలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్సు హాలులో జిల్లా స్థాయిలో లబ్ధిదారులకు సోమవారం ఉదయం 10 గంటలకు జరిగే వీడియో కాన్ఫరెన్సు అనంతరం ఆర్థిక సహాయం అందజేస్తారని వెల్లడించారు. షాపులు కలిగి ఉన్న నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు జగనన్న చేదోడు పథకం ద్వారా రూ.పది వేలు ఆర్థిక సహాయంగా అందజేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో మూడో విడతలో ఈ పథకం కింద 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి గాను 17,245 మంది వృత్తి పని వారికి రూ.17. 24 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. టైలర్ వృత్తిలో వున్న 7501 మందికి రూ.7.501 కోట్లు, 6854 మంది రజకులకు రూ.6.854 కోట్లు, 2890 మంది నాయీ బ్రాహ్మణులకు రూ.2.890 కోట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో తొలివిడతలో చేదోడు పథకం కింద 16359 మంది వృత్తి పనివారికి రూ.16 .35 కోట్లు, రెండో విడతలో 13,311 మందికి రూ.13.31 కోట్లు సహాయంగా అందజేసినట్లు పేర్కొన్నారు.

## నేటి నుంచి ధాన్యం కొనుగోలు : ఎఒ

**జామి :** మండలంలోని సోమవారం నుంచి అన్ని ఆర్‌బికేల్లో ధాన్యం కొనుగోలు చేపడతారని వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 10,800 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా, తాజాగా మండలానికి ప్రభుత్వం అదనంగా 7,900 మెట్రిక్ టన్నులు లక్ష్యంగా ఇచ్చిందన్నారు. ఆ మేరకు పౌర సరఫరాశాఖ జిల్లా మేనేజర్ ఆర్‌బికేల వారీగా లక్ష్యాలను వారి వారి లాగిన్‌లో వేయటం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని ఆర్‌బికేల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కొనసాగుతుందన్నారు. ప్రతి గ్రామంలో చిన్న, సన్నకారు రైతులు 100 ధాన్యం బస్తాలు కొనుగోలు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు జారీ చేయగా, నూర్పులు చేయాల్సిన రైతులు అందరు దాన్యాన్ని వారం రోజుల్లో నూర్పులు పూర్తి చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సంబంధిత మిల్లర్స్‌కు ధాన్యం పంపాలన్నారు.

## మే 1, 2, 3 తేదీల్లో దాడితల్లి పండగ

**బొబ్బిలి :** గొల్లపల్లి శ్రీదాడితల్లి గ్రామ దేవత పండగ మే 1,2,3న నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. దాడితల్లి ఆలయంలో ఉత్సవ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. మే 1న తోలేళ్ల ఉత్సవం, 2న సిరిమానోత్సవం, 3న అనుపోత్సవం నిర్వహించేందుకు తీర్మానం చేశారు. సిరిమానోత్సవానికి సిరిమాను కోసం ఏప్రిల్ 2న చెట్టు కొట్టనున్నారు.

## నేడు కేంద్ర బృందం పర్యటన

**వేపాడ :** మండలంలోని బానాది, ఆతవ గ్రామంలో సోమవారం కేంద్ర బృందం పర్యటించనుందని ఎంపిడిఒ పట్నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు వాటిపై ప్రజలకు వివరించనున్నారని చెప్పారు.


పురస్కారం అందుకుంటున్న శారద

## శారదకు సంక్రాంతి పురస్కారం

**బొబ్బిలి :** అభ్యుదయ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ చింతా శారదకు వరంగల్ కన్నతల్లి ఫౌండేషన్ సంక్రాంతి జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేశారు. శారద వివిధ సామాజిక కార్యక్రమాలు నిర్వహించడంతో కన్నతల్లి ఫౌండేషన్ పురస్కారాన్ని ఆదివారం వరంగల్‌లో ఫౌండేషన్ అధ్యక్షులు రాజన్‌బాబు, వరంగల్ కార్పొరేటర్ ఎం.రవి, చైల్డ్ వెల్ఫేర్ చైర్ పర్సన్ ఎస్.నాగమణి అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బాధితులకు జనసేన పరామర్శ

**వంగర :** మండలంలోని కొప్పరవలస గ్రామానికి చెందిన సాదేం సింహాచలం, గుడివాడ అప్పలనాయుడులకు చెందిన దాన్యం ఈనెల 27న అగ్ని ప్రమాదంలో దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని తెలుసుకున్న రాజాం నియోజకవర్గ జనసేన నాయకులు ఎన్ని రాజు ఆదివారం గ్రామానికి వచ్చి బాధిత రైతులతో మాట్లాడి సమస్యని అడిగి తెలుసుకుని వారిని ఓదార్చారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సాదేం రమేష్, శీలంకి చక్రపాణి, యోగేంద్ర పాల్గొన్నారు.

## ఆటో నుంచి జారిపడి వ్యక్తి మృతి

మృతుడు చిన్నకృష్ణ

**శృంగవరపుకోట :** ఆటోలో వెళ్తుండగా జారీ పడి అల్లు చిన్నకృష్ణ (52) ఆదివారం మృతి చెందాడు. ఎస్.ఐ. తారకేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన చిన్నకృష్ణ ఎస్.కోటలో ఆదివారం జరిగిన ఒక ఫంక్షన్‌కు వచ్చి భోజనాలు ముగిసిన అనంతరం తిరిగి స్వగ్రామమైన ధర్మవరం ఆటోలో వెళ్తుండగా మారుతీనగర్ వద్ద గల ప్లైవుడ్ పరిశ్రమ ఎదురుగా జారి రోడ్డుపై పడి పోయి తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అతతను అప్పటికే మృతిత చెందినట్లు వైద్యాధికారి నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## చోరీ కేసులో ముగ్గురు అరెస్టు

**బొబ్బిలి :** పట్టణంలో జరిగిన రెండు చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. పట్టణంలోని గతేడాది డిసెంబర్ నెలలో కుమ్మరివీధిలో ఒకటి, సిద్దావీధిలో ఒక చోరీ కేసు నమోదు అయింది. కేసుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు వివరాలు మేరకు పట్టణంలోని పల్లివీధికి చెందిన కాసా కిరణ్ జులాయిగా తిరుగుతూ చెడు వ్యసనాలకు లోను కావడంతో ముగ్గురు అబ్బాయిలను పరిచయం చేసుకుని నవంబర్ నెలలో సిద్దావీధిలోను, డిసెంబర్ నెలలో కుమ్మరివీధులలో ఎం.మనోహర్, ఎస్.మురళీకృష్ణ, మరో జువైనల్ కుర్రాడితో చోరీలు చేపించాడు. చోరీ చేసిన సొత్తును కిరణ్ తీసుకుని సొంత అవసరాలకు వాడుకునే వాడు. కాసా కిరణ్, మిగిలిన ముగ్గురు నడవడికపై అనుమానం వచ్చి నిఘా పెట్టి విచారించడంతో చోరీ చేసినట్లు అంగీకరించారు. రెండు కేసులలో ముగ్గురిని అరెస్టు చేయగా ఒకరు పరార్‌లో ఉన్నట్లు నాగేశ్వరరావు చెప్పారు.

# నిధుల్లేక నీరసం

- ముందుకు కదలని సచివాలయాల నిర్మాణాలు
- వెనకడుగు వేస్తున్న కాంట్రాక్టర్లు
- ఇంకా పరాయి పంచనే నిర్వహణ
- చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- రేగిడి

రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి మూడేళ్లు గడిచిన నిర్మాణాలు మాత్రం ముందుకు కదలడం లేదు. దీనికి కారణం నిధులు లేకపోవడమే తెలుస్తోంది. కొన్ని చోట్ల సచివాలయాలు భూమి స్థాయిలోనే మిగిలిపోగా మరికొన్ని చోట్ల నిర్మాణాలు ప్రారంభించి మధ్యలోనే నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క సచివాలయ నిర్మాణానికి రూ. 40 లక్షల మంజూరు చేసింది. 2019 -20 ఏడాదికి సంబంధించి నిర్మాణాలు చేపడితే వాటి వ్యయం సరిపోయేది. కానీ తరువాత రోజుల్లో నిర్మాణ ధరలు పెరగడం, అప్పటికే నిర్మించిన వాటికి బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. గ్రామస్థాయిలో చాలా మంది కాంట్రాక్టర్లు సచివాలయ నిర్మాణాలకు తొలుత ముందుకు వచ్చి ప్రారంభించినప్పటికీ బిల్లులు ఇవ్వకపోవడం, ఇచ్చినా కొన్ని చోట్ల ప్రభుత్వం ఇచ్చిన నిధులు చాలకపోవడంతో పనులను వివిధ స్థాయిల్లో నిలిపేశారు.

అద్దె కొంపలో ఉన్న సోమరాజుపేట సచివాలయం

**అదనపు నిధులు అవసరం**

నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు రావడంలేదు. ప్రస్తుత నిర్మాణాలు చేపడితే ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులకు అదనంగా 20 శాతం నిధులు కేటాయిస్తేనే తప్ప పనులు చేపట్టలేమని చెబుతున్నారు. అలా నిధులు కేటాయిస్తేనే పూర్తిస్థాయిలో సచివాలయ నిర్మాణాలు జరగవని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

**అద్దె కొంపల్లోనే సచివాలయాలు**

సచివాలయాలు నిర్మాణం పూర్తికాకపోవడంతో కొన్ని సచివాలయాలు అద్దె కొంపల్లోనే కొనసాగుతున్నాయి. 13 శాఖలకు సంబంధించి ఉద్యోగులు ఇరుకు గదుల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. సరైన గదులు లేక నానా అవస్థలు పడుతున్నారు. మండలంలో 25 సచివాలయాలు ఉన్నాయి. ఖండ్యాం, ఉణుకూరు గ్రామ సచివాలయాలకు నేటి వరకు భూమి పూజ చేయలేదు. 17 సచివాలయాల నిర్మాణాలకు నిధులు లేక అసంపూర్తిగా మిగిలిపోయాయి. సరసనా పల్లి, సోమరాజుపేట, ఉంగరాడ, తోకలవలస, వెంకంపేట, మునకలవలస గ్రామ సచివాలయాలకు పూర్తయినప్పటికీ బిల్లులు చెల్లించక ప్రారంభానికి నోచుకోలేదు. సచివాలయాలకు అదనంగా 20 శాతం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే గాని పూర్తిస్థాయిలో సచివాలయ నిర్మాణాలు జరగవని ఖరాఖండీగా కాంట్రాక్టర్లు చెబుతున్నారు.. ఈ తంతు జిల్లా వ్యాప్తంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సచివాలయ నిర్మాణాలకు నిధులు సమకూర్చి పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టాలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

కొమిరిలో అద్దె భవనంలో ఉన్న సచివాలయం ఇదే

**అదనపు నిధులతో బిల్లులు వెంటనే బిల్లులు చెల్లిస్తాం.**

సచివాలయాలు ప్రస్తుతం నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు అదనంగా నిధులు కలిపి తక్షణమే బిల్లులు చెల్లిస్తాం. గత మార్చిలోగా బిల్లులు చెల్లింపుల్లో సాంకేతిక పరమైన సమస్యలు ఏర్పడ్డాయి. 2019 -20లో సచివాలయాలు మంజూరైనప్పటికీ మధ్యలో నిర్మాణ చేపట్టి నిధులు చాలని కాంట్రాక్టర్లకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బిల్లులు చెల్లిస్తాం. అసంపూర్తిగా ఉన్న సచివాలయాలను త్వరగా పూర్తి చేయాలి. ప్రభుత్వం గత నిధులకు 20 శాతం కలుపుతూ నిధులు సమకూర్చుతుంది. నిధులు పుష్కలంగా ఉన్నాయి.

**రామకృష్ణ, మండల జెఇ, రేగిడి**

## మామిడి, జీడిపై మంచు ప్రభావం

ప్రజాశక్తి- వేపాడ

గత రెండు వారాలుగా వర్షాన్ని తలపిస్తున్నట్లు కురుస్తున్న మంచుతో మామిడి, జీడి పూతలు మాడిపోతు న్నాయి. ముఖ్యంగా కొంపల్లి, బల్లంకి, బానాది, చిన్న గుడిపాల, నల్లబెల్లి, వావిలపాడు, వీలుపరితి, వేపాడ, దబ్బిరాజుపేట, కరకవలస, జాకేరు, పి కే ఆర్ పురం, ఎస్ కే ఆర్ పురం, కేజీ పూడి గ్రామాలలో రైతులు ఆశలపై పొగ మంచు నీళ్లు జల్లింది. మామిడి, జీడి తోటలు పూత దశకు రావడం నుంచి పిందే దశకు మారే సమయంలో కీలకంగా ఉంటు ంది. అటువంటి ఈ దశలో మంచు ప్రభావం పంటపై పడటంతో పూత మొత్తం పోతుందని రైతులు వాపోతు న్నారు. పూత నిలకడ పైనే దిగుబడులు ఆధారపడి ఉంటాయి అనడంలో సందేహం లేదు. కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా మంచు కురుస్తుండ డంతో పంట మొత్తం నాశనమైపోతుం దని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది దిగుబడులు ఆశాజనకంగా ఉండవచ్చని భావించిన రైతులకు మంచు కలవరం సృష్టిస్తోంది. ప్రతి రోజూ సాయంత్రం ఐదున్నర గంటల నుండి ఉదయం 8,9 గంటల వరకు పొగ మంచు విపరీతంగా కురుస్తుంది. దీంతో మామిడి, జీడితతపూత మాడి రాలిపోతుంది.

మామిడి పూతను పరిశీలిస్తున్న ధరణి

**తేనె మంచు పురుగుతో ప్రమాదం**

పూతను తేనె మంచు పురుగు కూడా ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరి కొద్ది రోజులు పాటు ఇదే విధంగా మంచు కురిస్తే పంటపై ఆశలు వదులుకోవాల్సిం దేనని రైతులు ఆవేదన వెలగక్కుతున్నారు.

**సస్యరక్షణతో అధిక ఫల సాయం**

మామిడి, జీడి పంటలకు సంబంధించి సకాలంలో సస్య రక్షణ చర్యలు పాటిస్తే అధిక ఫల సాయం పొందవచ్చునని మండల ఉద్యాన వన శాఖ అధికారి ధరణి అన్నారు. ప్రస్తుతం తేనె మంచు పురుగు ప్రభావంతో పాటు పొటాస్ లోపం వల్ల మామిడి పూత రాలిపోతుందన్నారు. ఫొటాస్ లోపం నివారణకు ఐదు గ్రాముల పొటాషియం నైట్రేట్ మందును లీటరు నీటిలో కలిపి 200 లీటర్ల ద్రావణాన్ని ఎకరానికి పిచికారి చేయాలన్నారు. ప్రస్తుతం కొన్ని చోట్ల మామిడి పూత, జీడి పూత అంతంత మాత్రంగానే ఉందన్నారు. పూత వచ్చిన తోటల్లో పూత నిలవడానికి లీటరు నీటికి 1.5 మిల్లీ లీటర్ల ప్రోనోపోస్ మందును పిచికారి చేయాలన్నారు.

## రసవత్తరంగా క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ, వల్లంపూడి జంట గ్రామాలలో పరదేశమ్మ- ముత్యాలమ్మ తీర్థ మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం రాత్రి రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలలో 14 టీమ్‌లు పాల్గొనగా ఎస్‌కోటకు చెందిన టీమ్ మొదటి బహుమతిగా రూ. 5వేలు, వేపాడ టీమ్‌కు రెండో బహుమతిగా రూ.3వేలను కమిటీ సభ్యులు, సర్పంచ్ మెల్లిపాక అర్జునమ్మ, ఎంపిటిసి గాడి గంగ తల్లి, చేతుల మీదుగా అందించారు. అలాగే కుండల పోటీల్లో విజేతలకు కూడా బహుమతులు అందించారు.

**ఆకట్టుకున్న ఎడ్ల పరుగు**

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పందేలు ఆకట్టుకున్నాయి. ఎడ్ల బళ్ళ పరుగు విజేతలకు గ్రామ సర్పంచ్ ఎం అర్జునమ్మ, ఎంపిటిసి గంగ తల్లి, కమిటీ సభ్యులు చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

గుర్రపు స్వారీ చేస్తున్న క్రీడాకారుడు

**అలరించిన గుర్రపు స్వారీ**

మండలంలోని జాకీర్ గ్రామంలో ఆదివారం జరిగిన పైడమ్మ చిన్నమ్మలు పేరంటాలు, శ్రీ వీరాంజనేయ స్వామి 60వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గుర్రపు పరుగు పోటీలు హోరెత్తాయి. ఈ పోటీల్లో 11 మంది పాల్గొని తలబడ్డారు. విజేతలకు డిసిసి చైర్మన్ వివి చిన్న రామనాయుడు, గ్రామ సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, గ్రామ పెద్ద బుద్ధ అప్పలనాయుడు, ఎంపిటిసి టివి రమణ, బుద్ధ కృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బహుమతలును అందించారు. అనంతరం నిర్వహించిన సంగిడి రాళ్ల పోటీలు ఉద్రూతలూగించాయి.

సంగిడీ రాయి ఎత్తుతున్న వ్యక్తి

## విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎం.శశిభూషణరావు ఆధ్వర్యంలో మెట్టవలసలో ఆదివారం పదోతరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్స్‌ని పంపిణీ చేశారు. స్పందన స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ కాజా వేణుగోపాల్ రావు సౌజన్యంతో 40 పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యారంగంలో వస్తున్న మార్పులను, ప్రణాళిక బద్ధంగా చదవటం కోసం కార్యాచరణ, మంచి ఫలితాల కోసం యుటిఎఫ్ చేస్తున్న కృషిని యుటిఎఫ్ నాయకులు విజయగౌరి, ప్రసన్నకుమార్, కేశవరావు, శశిభూషణరావు, రమేష్, కృష్ణ దాసు మాష్టారు వివరించారు. యుటిఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్ పేపర్స్‌ను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రామ సర్పంచ్ పువ్వులు మాధవరావు, మండలం వైస్‌ఎంపిపి శంకరరావు, పిఎంసి చైర్మన్ లక్ష్మంనాయుడు, పెద్దలు తౌడు అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. శివశంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్పందన స్వచ్ఛంద సంస్థ నాయకులు శశి తదితరులు పాల్గొన్నారు..

మోడల్ పేపర్స్ పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

## జనసేన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జనసేన నెల్లిమర్ల నియోజక వర్గం ఇంఛార్జి లోకం నాగ మాధవి ఆధ్వర్యంలో ఆదివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నియోజక వర్గ నాలుగు మండలాల నుండి సుమారు వెయ్యి మంది జనసేన కార్యకర్తలు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లతో పాల్గొని ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా లోకం నాగ మాధవి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అన్ని ఇన్ని కావని పాలన చూస్తే అసమర్థంగా ఉందని, అవినీతి పాలన రాజ్యమేలుతుందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకించటానికి, ప్రజల తరుపున నిలబడటానికి తామున్నామని చెప్పడానికే ఈ ర్యాలీని చేపట్టామని అన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా తాను నియోజకవర్గ ప్రజలతోనే ఉంటానని అన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని అన్నారు. ఈ భారీ ర్యాలీ మొత్తం నాలుగు మండలాలను కవరు చేస్తుందని, తద్వారా సమాజానికి తామున్నామని భరోసా ఇస్తున్నామని తెలిపారు.

ర్యాలీ చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

## మెకానిక్‌ల ఉత్తమ ప్రతిభ

ప్రజాశక్తి - శృంగవరపుకోట

స్థానిక ఆర్‌టిసి డిపో పరిధిలో మెకానిక్‌లు నరసయ్య, మహమ్మూద్‌లు ఉత్తమ ప్రతిభ కనపరిచారని డిపో మేనేజర్ కె. రమేష్ అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆదివారం మెయింటినెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎస్‌ఐ లోవరాజు చేతులు మీదుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన మెకానిక్‌లకు అవార్డు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, గ్యారేజ్ సిబ్బంది, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌ఐ లోవరాజు

ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

## ఆనందో బ్రహ్మకు విశేష స్పందన

**బొబ్బిలి :** శ్రీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఆనందో బ్రహ్మకు విశేష స్పందన లభించింది. యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఆనందో బ్రహ్మ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పలు ప్రదర్శనలు చేశారు. మత సామరస్యాన్ని కాపాడాలని చిన్నారులు చేసిన ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది.

## టిడిపిలో పలువురు చేరిక

**బొబ్బిలి :** బాడంగి మండలం లోని రామచంద్రా పురం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్తలు ఆ పార్టీని వీడి టిడిపిలో చేరారు. బొబ్బిలి కోటలో ఆదివారం బాడంగి మండల పార్టీ అధ్యక్షుడు తెంటు రవిబాబు, వైస్ ప్రెసిడెంట్ సింగిరెడ్డి భాస్కరరావు, పార్లమెంట్ బిసి సాధికార సమితి కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు బిసి సాధికారసమితి సభ్యుడు బొంతు త్రినాధ నాయుడు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు, నియోజకవర్గ ఇంచార్జ్ బేబినాయన సమక్షంలో 18 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తత

పార్టీలోకి ఆహ్వానిస్తున్న బేబినాయన, రాజా

# అరసాడలో అపారిశుధ్యం

- రోగాల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- వంగర

మండలంలోని అరసాడ గ్రామంలో అపారిశుధ్యం విలయతాండవం చేస్తోంది. కాలువల్లో పూడికలు పేరుకుపోయి, మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు, నాయకులు ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సమయాల్లో తమ గ్రామం వైపు చూడటం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అరసాడలో ఎస్‌సి, ఎస్‌టి, చాకలి, మంగలి, కాపు, నెయ్యల, నాగవంశం, తెలగ, దేవాంగులతోపాటు 23 కులాలకు చెందిన సుమారు 5వేల మంది నివసిస్తున్నారు. గ్రామంలో గత కొంత కాలంగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఎస్‌సి కాలనీ చివర నుండి ప్రధాన రోడ్డు, రెల్లివీధి ప్రారంభం నుండి బస్‌స్టాండ్, చాకల వీధి సచివాలయం ముందు, బ్యాంకు రోడ్‌లో మధ్య వీధి తదితర వీధుల్లో కాలువల్లో పూడికలు పేరుకుపోయి మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. వంగర మండలం నుంచి రాజాం పట్టణానికి వెళ్లాలంటే ఈ అరసాడ గ్రామం మీదుగా వెళ్లాల్సి ఉంది. ఇక్కడి ప్రజలతో పాటు రేగిడి, గరుగుబిల్లి తదితర మండలాల ప్రజలు రాకపోకలు కూడా ఈ మార్గం గుండానే సాగిస్తూ ఉంటారు. అలాంటి ఈ గ్రామంలో ప్రధాన కాలువల్లో కూడా పూడిక తీయకపోవడంతో ఆ గ్రామం మీదుగా వచ్చిన ప్రజలు అక్కడ దుర్వాసన వెదజల్లడంతో ముక్కు మూసుకొని వెళ్ళవలసిన పరిస్థితి ఉంది. కనీసం సర్పంచ్, సచివాలయం ఉద్యోగులైన పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇదీ చాకలివీధి కాలువ పరిస్థితి

మెయిన్ వీధి కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

గ్రామంలోకి వచ్చిన అధికారుల దృష్టికి పారిశుధ్యంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

**దుర్వాసనకు భోజనం కూడా చేయలేకపోతున్నాం**

కాలు వల్లో పూడికలు తీయకపోవడంతో మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతుంది. ఇంటి దగ్గర ఉన్నప్పుడు కనీసం భోజనం కూడా చేయలేకపోతున్నాం.

**గళావిల్లి సీతమ్మ, సాకల వీధి, అరసాడ**

**రోగాలు బారిన పడుతున్నాం**

పారి శుధ్య పనులు సక్రమంగా చేయక పోవడంతో దోమలు మరింత విజంభించి రోగాలు బారిన పడుతున్నాం. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరిస్తే బాగుంటుంది.

**పొట్నూరు శ్రీనివాసరావు మెయిన్ రోడ్డు వీధి, అరసాడ**

**పరిశీలించి పనులు చేపడతాం**

గ్రామంలో ఇటీవల పారిశుధ్య పనులు నిర్వహించాం. అవసరమైతే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పనులు చేపడతాం.

**లోపింటి త్రినాధరావు, ఇఒపిఆర్‌డి వంగరత**

## అంతర్జాతీయ కార్టూన్ పోటీల్లో బొబ్బిలికి చోటు

**బొబ్బిలి :** తానా ఈ కార్టూన్ పుస్తకంలో భాను కార్టూన్ తెలుగు భాష, తెలుగు భాష సంస్కృతి అండ్ తెలుగు సంస్కృతిపై ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ప్రపంచ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్టూన్ల పోటీ నిర్వహించింది. ఈ పోటీకి మొత్తం 740 కార్టూన్లు రాగా, అందులో అత్యుత్తమంగా ఉన్న 140 కార్టూన్లతో తానా ఈ సంకలనం వేసింది. అందులో బొబ్బిలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గుంట్రెడ్డి భాస్కరరావు (భాను) గీసిన కార్టూన్‌కు చోటు లభించింది. ఈ పుస్తకాన్ని విజయవాడలో ఇటీవల సర్వోత్తమ గ్రంథాలయంలో ఎపి హైకోర్టు న్యాయమూర్తి యు. దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉప సభాపతి మండలి బుద్ధ ప్రసాద్, తానా ప్రపంచ సాహిత్య వేదిక నిర్వాహకులు తోటకూర ప్రసాద్, ప్రముఖ కార్టూనిస్టులు పాల్గొన్నారు. ఆయనకు సలువురు అభినందనలు తెలిపారు.

**జనరల్ నోటీసు**
**మహారాజశ్రీ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ స్పెషల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు విజయనగరం**
**OS 631/21**

Between:
కాతా శ్యామ్‌కుమార్ ......వాది
And :
పెనుమత్స ప్రభావతి ....ప్రతివాది

ఈ నోటీసు ద్వారా పై దావాలో వాది అయిన శ్యామ్‌కుమార్ ఇందలి ప్రతివాది అయిన ప్రభావతి తనకు దావా షెడ్యూలు ఆస్థిపై అగ్రిమెంటు వ్రాసియున్నారని సదరాస్థిని తనకు అమ్మ జూపినందున సదరాస్థిని తనకు అమ్మాలని కోర్టులో దావాను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ప్రతివాదికి కోర్టువారు ఈ ప్రకటన ద్వారా నోటీసు ఆర్డరు చేసియున్నారు. సదరు దావా **తేదీ 15-2-2023న** వాయిదా అయిఉన్నందున మీరు స్వయంగా కాని, మీ తరపు న్యాయవాది ద్వారాకాని కోర్టులో **ఉదయం 10గం॥లకు** హాజరై మీ వాదనను దాఖలు చేయవలెను. లేనిఎడల మీకు పరోక్షంగా దావాను తీర్మానించబడును.

కూరెళ్ల నాగభూషణరావు
ఆర్.శ్రీనివాసన్
అడ్వకేట్, విజయనగరం

**బహిరంగ ప్రటన**
**మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిలు జడ్జి కోర్టు**
**S.O.P.10 of 2022**

Between:
1) ఆవాల పైడితల్లి, భర్త లేటు లక్ష్మణ, పెంటశ్రీరాంపురం గ్రామం, గంట్యాడ మండలం, విజయనగరం జిల్లా
2) ఆవాల ప్రసన్నకుమార్, తండ్రి లేటు లక్ష్మణ, పెంటశ్రీరాంపురం గ్రామం, గంట్యాడ మండలం, విజయనగరం జిల్లా ......పిటిషనర్లు
And :
NIL .....రెస్పాండెంట్లు

యిందు మూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా గంట్యాడ మండలం, పెంటశ్రీరాంపురం గ్రామ కాపురస్తుడు ఆవాల సత్యం కుమారుడు ఆవాల లక్ష్మణ తే15-2-2017దీని STARS MULTIPURPOSE CO-OPERATIVE SOCIETY LIMITED, Saifabad, Hyderabad - 63 వారి నుండి, నెంబర్లు 445001650786 మరియు 445001650786 గల ఒక్కొక్కిటి రూ. 15,000/-లు అక్షరములా పదిహేనువేల రూపాయలు చొప్పున రెండు F.D.Rలు వడ్డీతో సహా యిందలి పిటిషనర్లు పొందుటకు Succession Certificate యిందలి పిటిషనర్లుకు ఇప్పించమని కోరుచూ పై నెంబరు పిటిషనను దాఖలు చేసియున్నారు. కావున పై విషయమై ఎవ్వరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల కోర్టువారి ఎదుట **తే 20-2-2023దీని ఉదయము 10-30 గంటల**కు స్వయముగా కాని, వకీలు ద్వారాగాని హాజరయి తెలుపుకోవలసినదిగా యిందుమూలముగా తెలియచేయడమైనది.

CH.V.Srinivasa Rao
Advocate, Vizianagaram-3
Mobile : 9705503435, 9440085787

**బహిరంగ ప్రటన**
**మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిలు జడ్జి కోర్టు**
**S.O.P.11 of 2022**

Between:
1) ఆవాల పైడితల్లి, భర్త లేటు లక్ష్మణ, పెంటశ్రీరాంపురం గ్రామం, గంట్యాడ మండలం, విజయనగరం జిల్లా
2) ఆవాల ప్రసన్నకుమార్, తండ్రి లేటు లక్ష్మణ, పెంటశ్రీరాంపురం గ్రామం, గంట్యాడ మండలం, విజయనగరం జిల్లా ......పిటిషనర్లు
And :
NIL .....రెస్పాండెంట్లు

యిందు మూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా గంట్యాడ మండలం, పెంటశ్రీరాంపురం గ్రామ కాపురస్తురాలు ఆవాల లక్ష్మణ కుమార్తె ఆవాల సీత వురపు సీతమ్మగారి పేరు మీద ఆమె తండ్రి లేటు ఆవాల లక్ష్మణ SAHARA CREDIT Co-operative Society Limitedలో 2740 నెంబరుతో నెలకు రూ. 1,000/-లు అక్షరములా వెయ్యి రూపాలయిల చొప్పున RD కట్టుట జరిగినది. దర్మిలాను సదరు ఆవాల సీత వురపు సీతమ్మ తే 5-7-2018దీని కాలము చేసినందున సదరు ఆవాల సీత వురపు సీతమ్మకు చెందవలసిన R.D సొమ్ముకు Succession Certificate యిందలి పిటిషనర్లుకు ఇప్పించమని కోరుచూ పై నెంబరు పిటిషనను దాఖలు చేసియున్నారు. కావున పై విషయమై ఎవ్వరికైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టువారి ఎదుట **తే 20-2-2023దీని ఉదయము 10-30 గంటల**కు స్వయముగా కాని, వకీలు ద్వారాగాని హాజరయి తెలుపుకోవలసినదిగా యిందుమూలముగా తెలియచేయడమైనది.

CH.V.Srinivasa Rao
Advocate, Vizianagaram-3
Mobile : 9705503435, 9440085787